

రాజీవ్‌గాంధీ విగ్రహం జంక్షన్ వద్ద బురదమయమైన రోడ్డు



43వ వార్డులో అధ్వానంగా వేంకటేశ్వరాలయానికి వెళ్లే మార్గం

దారుణ దారులు

- స్థానిక రహదారులు ఛిద్రం
- రైల్వే న్యూకాలనీ ప్రధాన రహదారి బురదమయం
- రాకపోకలకు వాహన చోదకుల తంటాలు
- కన్నెత్తి చూడని పాలకులు, అధికారులు



రైల్వే న్యూకాలనీ బజార్ ప్రాంతంలో తవ్వి వదిలేసిన రోడ్డు

తాటిచెట్లపాలెం: స్థానిక రహదారులు దారుణంగా తయారయ్యాయి. రాకపోకలకు వీలు లేకుండా ఛిద్రమయ్యాయి. చివరికి జాతీయ రహదారి పరిస్థితి కూడా అధ్వానంగా మారింది. ఇటువంటి రోడ్లపై రాకపోకలకు వాహన చోదకులతోపాటు పాదచారులు నానా తంటాలు పడుతున్నారు. ఇక్కడి రహదారుల దుస్థితి వైపు పాలకులు కన్నెత్తి చూడటం లేదు. అధికారులు వీటి మరమ్మతుల ఊసెత్తడం లేదు.

జాతీయ రహదారిలో తవ్వకాలు

జాతీయ రహదారి–5లో చాలా చోట్ల ఆఘమేఘాలపై ఇటీవల తారు రోడ్డు వేశారు. వీవీఐపీలు, మంత్రుల పర్యటనలు, మరోవైపు యోగాంధ్ర కోసం పలు ప్రాంతాల్లో రోడ్లు నిర్మించారు. ముఖ్యంగా ఎన్‌ఏడీ కొత్త రోడ్డు నుంచి మద్దిలపాలెం జంక్షన్ వరకు ఈ విధంగా రోడ్లు వేశారు. కొన్ని చోట్ల రాత్రికి రాత్రి వేస్తే, మరికొన్ని చోట్ల వర్షాభావ పరిస్థితుల్లో సైతం వేసేసి మమ అనిపించేశారు. అంతటితో ఆగకుండా ఇలా వేసిన రోడ్లు మళ్లీ చాలా చోట్ల తవ్వేస్తున్నారు. అసలు రోడ్లు ఎందుకు నిర్మిస్తున్నారో.. ఎందుకు మళ్లీ తవ్వేస్తున్నారో ఎవరికీ అర్థం కావడం లేదు. ప్రజల సొమ్ము ఇలా వృథా చేయడం తగదని కొందరు స్థానికులు అంటున్నారు.

రైల్వే న్యూకాలనీలో...

జీవీఎంసీ 42, 43 వార్డుల పరిధి తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డు నుంచి రైల్వే న్యూకాలనీ ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. 80 ఫీట్ రహదారి నుంచి రామాలయం బజార్, మసీదు జంక్షన్ వరకు రోడ్డు పక్కన పైప్‌లైన్ పనుల నిమిత్తం తవ్వేశారు. వెంట వెంటనే చేయాల్సిన ఈ పనులు నత్త నడకన సాగుతుండటంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు వందలాది వాహనాలు, అధిక సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు తమ విధులు, బడులు, కాలేజీలు, వ్యాపారాలకు ఇదే దారి ఉపయోగిస్తుంటారు. ఈ మార్గంలో పలు స్కూళ్లు, శివాలయం, ఆంజనేయ, వినాయక ఆలయం, మసీదు వంటి పలు ప్రార్థనా స్థలాలు న్నాయి. నిత్యం ప్రజలు ఇక్కడికి వచ్చి వెళ్తుంటారు. అటువంటి ప్రధాన రహదారి కొన్ని నెలలుగా శిథిలావస్థలో ఉండటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రహదారి తవ్వి.. దానిని సక్రమంగా పూడ్చకుండా వదిలేయడంతో గోతులు, వర్షం కారణంగా బురద పేరుకుపోయి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.



అక్కయ్యపాలెం హైవే బస్టాప్ ముందు తవ్విన రోడ్డు



రైల్వే న్యూకాలనీ శివాలయం ముందు దారుణంగా ప్రధాన రహదారి

ఇద్దరు ఎమ్మెల్యేలు

ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలోని ఈ ప్రాంతంలో ఇద్దరు కూటమి ఎమ్మెల్యేలు పి.విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ ఉండి కూడా రహదారి పనులను పూర్తి చేయించకపోవడం, కనీసం రోడ్లు వేయించలేకపోవడం దురదృష్టకరమని కాలనీ వాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వెంటనే పనులు పూర్తి చేసి రహదారులను బాగుచేయాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

'మనో జలధి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట: డాక్టర్ కొణపల విశ్వేశ్వరరావు రచించిన 'మనో జలధి' కవితా సంపుటి ఆవిష్కరణ సభ గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథి రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని మంచిని చెడును విశ్లేషించే గుణం కలది ఈ మనో జలధి కవితా సంపుటి అన్నారు. రచయిత గరిమెళ్ల నాగేశ్వరరావు పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, ఆచార్య దాసు మధుసూదనరావు, ఉప్పల అప్పలరాజు, బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పితామహుడు సాహు మహారాజ్

అల్లిపురం: రిజర్వేషన్ల పితామహుడు కొల్హాపూర్ సంస్థానాధిపతి సాహు మహారాజ్ అని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కోశాధికారి పెదపెంకి శివప్రసాదరావు అన్నారు. సాహు మహారాజ్ 151వ జయంతి నగరంలో పార్టీ కార్యాలయంలో జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు భీమరశెట్టి విశ్వనాథం అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా సాహు మహారాజ్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలో మొదటిసారి బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత సాహు మహారాజ్‌దే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఎ.రామచంద్రరావు, సవరాలు రమేష్, నందికోళ్ల అప్పారావు, ఎ.నారాయణ, దేవరపల్లి శరత్, చోడవరపు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెన్షనర్ల డిమాండ్లు పరిష్కరించకుంటే ఆందోళన



మాట్లాడుతున్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు

మహారాణిపేట: ఉద్యోగులకు, పెన్షనర్ల డిమాండ్లు, ఇతర సమస్యలను తక్షణం పరిష్కరించాలని లేకుంటే ఆందోళనకు దిగనున్నట్లు జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు డీడీ ప్రసాదరావు అన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు విషయాలపై కూలంకషంగా చర్చించినట్లు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19, 20 తేదీల్లో గుంటూరులో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ సర్వసభ్య సమావేశం చర్చించిన అంశాలను వివరించారు. పెండింగ్ డిమాండ్లు, డీఏ బకాయిలు, కొత్త పీఆర్సీ అమలు, మధ్యంతర భృతి, అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ శాతం పెంపు తదితర డిమాండ్లపై చర్చించామన్నారు. డిమాండ్లను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఆందోళన చేసేందుకు్కూడా వెనుకాడబోమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి, జిల్లా ట్రెజరీ అధికారి జె.సత్యారావు, సంఘం కోశాధికారి టి.గోపాలకృష్ణ, అగర్వాల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జేమ్స్ ఎస్‌కే ఆడమ్స్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం, అక్షింతలు అందజేశారు.

'జూలై 9 సమ్మెను విజయవంతం చేయండి'



ఎన్టీపీసీ వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తున్న గనిశెట్టి

పరవాడ: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన లేబర్ కోడ్స్ రద్దు డిమాండ్‌తో జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ మెయిన్‌గేట్ వద్ద సమ్మెకు సంబంధించిన కరపత్రాలను గురువారం పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కనీస వేతనాల చట్టం అమలు చేసి, కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పు చేసే చర్యలను విరమించాలన్నారు. సమాన పనికి సమాన వేతన చట్టాలను తొలగించడం అన్యాయమన్నారు. కార్మికులకు 8 గంటల పని వేళ్ళని 12 గంటలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, పెట్టుబడిదారులకు ఊడిగం చేసే పాలకుల విధానాలను వ్యతిరేకించాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం దొంగచాటుగా నాలుగు లేబర్ కోడ్స్ కింద మార్చి, అమలుకు ప్రయత్నాలు ముమ్మరం చేసిందన్నారు. దీన్ని నిరసిస్తూ దేశంలో ఉన్న కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సిటు నాయకులు పైల పోతినాయుడు, పి.గోవిందరాజు, పైల సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు



ధ్యాన మందిరంలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సాయిబాబాకు విశేష పూజలు చేశారు. అనంతరం ధ్యాన మందిర ప్రాంగణంలో మేక్సివిజన్ ఐ హాస్పిటల్స్, యోధ డయాగ్నోస్టిక్స్ సహకారంతో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు స్థానికులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి వాతావరణ మార్పుల కారణంగా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అందరికీ ఆరోగ్యం, మంచి జీవన శైలిని అందించాలనే ఉద్దేశంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం మాలధారులు, భక్తులు, పేదలు, యాచకులకు ప్రత్యేక అన్నదానం చేశారు. భక్తులు తమ కుటుంబంలో జరిగే శుభకార్యాలు, జ్ఞాపకార్థ కార్యక్రమాలను ధ్యాన మందిరం వద్ద అన్నదానం రూపంలో నిర్వహించుకోవచ్చని మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. కార్యక్రమాల్లో మేక్సివిజన్ ఐ హాస్పిటల్స్ సిబ్బంది అయ్యప్ప, వేదవతి, శ్రీనివాసరెడ్డి, యోధ డయాగ్నోస్టిక్స్ సిబ్బంది తరుణ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులు కాపాడుకుందాం



సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

మురళీనగర్: కార్మికుల హక్కులను కాపాడుకుందామని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. 50వ వార్డు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు గురువారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల జీతాలు తక్షణమే చెల్లించాలని వారు డిమాండు చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్లను రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని నినాదాలు చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో 5 వేల మంది కార్మికులను మోదీ ప్రభుత్వం తొలగించిందని, ఇది అన్యాయమన్నారు. పోరాడిన ప్లాంట్ కార్మికులను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో అణచివేయించిందన్నారు. స్టీల్‌ప్లాంట్ లో కీలకమైన రెండు విభాగాలను ప్రైవేటుపరం చేయాలని ప్రస్తుతం మోదీ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని విమర్శించారు. విశాఖలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు ఇవ్వడంలేదని, మరోపక్క పారిశుధ్యాన్ని ప్రైవేటుపరం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మికులందరూ సమైక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పోరాడితేనే కార్మికుల హక్కులు, చట్టాలు నిలబడతాయన్నారు. దీనిలో భాగంగా జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం సీఐటీయూ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. శ్రావణ్‌కుమార్, ఒ. అప్పారావు వార్డు కమిటీ నాయకులు అప్పలరాజు, రమణ, లక్ష్మి, అచ్చియ్యమ్మ, శివ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన ర్యాలీ



అక్కయ్యపాలెంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



మాదకద్రవ్యాలను నిరోధించాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

సీతంపేట: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ హెచ్‌ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పాఠశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ ఎన్జీజీవోస్ కాలనీ, మెయిన్ రోడ్డు మీదుగా తిరిగి స్కూల్ వరకు కొనసాగింది. సుమారు 200 మంది విద్యార్థులు ర్యాలీలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం, ఉపాధ్యాయులు సునీత, గ్లోరీ, నిర్మల, రమణి, రత్నం, జ్యోతి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మురళీనగర్: మాదకద్రవ్య మహమ్మారిని సమష్టిగా తరిమికొట్టాలని కిశోర్ వికాస్ బృందం సభ్యులు పిలుపునిచ్చారు. గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో మాధవధార జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల సంభవించే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. మానవ జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తున్న మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వారు సూచించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.పెద్దినాయుడు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మౌలా బీబీ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత జిల్లాయే లక్ష్యం

మహారాణిపేట: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెదవాల్తేరు పోలమాంబ ఆలయం నుంచి మొదలైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఈఎన్‌టీ ఆస్పత్రి వరకు కొనసాగింది. అనంతరం ప్రభుత్వ మానసిక ఆస్పత్రి మీటింగ్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు మాట్లాడారు. విశాఖను మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో యువత ముఖ్య పాత్ర పోషించాలన్నారు. మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయట పడడం కోసం మందులు ఏ విధంగా సహకరిస్తాయో తెలిపారు. అనంతరం ఎన్జీవో సిబ్బందికి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మత్తు మందుల వాడకం, అక్రమ రవాణాను వ్యతిరేకిస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోణంకి రమేష్, డాక్టర్ హరికృష్ణ, ప్రభుత్వ మానసిక వైద్యశాల ప్రొఫెసర్ డాక్టర్ హైమావతి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రవణ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, సమిత ప్రాజెక్టు డైరెక్టర్ డి.వీరభద్రరావు, జిల్లా సీపీఎం ఉమామహేశ్వరరావు, సూపర్‌వైజర్ బద్రి, సమిద స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, వివిధ ఎన్జీవోలు, నర్సింగ్ స్టూడెంట్లు, కమ్యూనిటీ సభ్యులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగించారు



మహారాణివీధి కాలువలో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది



జ్యోతినగర్ గెడ్డలో వ్యర్థాలు తొలగిస్తున్న శానిటరీ సిబ్బంది

- హోటళ్ల యాజమానులకు చలానాలు
- స్పందించిన పబ్లిక్‌హెల్త్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియా పరిధి మహారాణివీధి, జ్యోతినగర్ ప్రాంతాల్లో గల హోటళ్లు, క్యాటరింగ్ నిర్వాహకులు విడుదల చేస్తున్న వ్యర్థాలతో రోడ్లు, డ్రైనేజీలు అధ్వానంగా మారాయి. హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగుల్లో మిగిలిన వ్యర్థాలు రాత్రి సమయాల్లో కాలువలు, సమీప గెడ్డల్లో వేసేయడంతో మురుగు ప్రవాహానికి అడ్డంకిగా మారి దుర్గంధం వ్యాప్తి చెందుతోంది. దీంతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై ఈ నెల 25న సాక్షి దినపత్రికలో 'హోటళ్ల వ్యర్థాలతో అనర్థాలు' పేరిట కథనం వెలువడింది. దీనిపై జోన్–5 జోనల్ కమిషనర్ బి.రాము స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.ఎస్.నాయుడు పర్యవేక్షణలో గురువారం హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ యాజమానులకు చలానాలు విధించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే ఆ సంస్థలను సీజ్ చేస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో కాలువలు, గెడ్డల్లో వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు తొలగించడంతో స్థానికులు, పాదచారులు హర్షం వ్యక్తం చేశారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమీక్ష

దాబాగార్డెన్స్: వచ్చే నెల 9న సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణకు సంబంధించి జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ గురువారం తన ఛాంబర్లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. గిరి ప్రదక్షిణలో లక్షలాదిమంది భక్తులు పాల్గొంటారని, అందుకు జీవీఎంసీ పారిశుధ్యం, మరుగుదొడ్లు, దోమల నియంత్రణ వంటి వాటిపై తీసుకోవల్సిన జాగ్రత్తలపై జీవీఎంసీ సహాయ వైద్యాధికారులు, శానిటరీ సూపర్‌వైజర్లు, పీఎంయూ సిబ్బందికి తగు సలహాలు, సూచనలు చేశారు. భక్తులు నడిచే దారి పొడవునా పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసేందుకు రూట్ మ్యాప్ ఏర్పాటు చేసి, ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని ఆందోళన



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆయాలు, కుకింగ్ హెల్పర్లు

మహారాణిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న వేలాది మంది ఆయాలు, కుకింగ్ హెల్పర్లకు మూడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని బాధితులు కోరారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ స్కూల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ సీహెచ్ ప్రమీల ఆధ్వర్యంలో నాయకురాళ్లు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ పేదవారైన ఆయాలకు ఇచ్చే రూ.6 వేలు, కుకింగ్ హెల్పర్ల ఇచ్చే రూ.3 వేలు ప్రతి నెల ఇవ్వక పోవడం వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయాలకు మార్చి, ఏప్రిల్, మే నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆమె తెలిపారు. వీరు పాఠశాలల్లోని గదులు, లెట్రిన్‌లను రోజుకు మూడు నాలుగు సార్లు శుభ్రం చేస్తూ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని అన్నారు. అయితే వీరి పట్ల ప్రభుత్వ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆమె విమర్శించారు. వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలని, ఆయాలకు రూ.15 వేలు, కుకింగ్ హెల్పర్లకు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన ప్రతినిధి బృందంలో నాయకురాళ్లు కె. కొండమ్మ, కాకినాడ రాజేశ్వరి, రేగాని లక్ష్మి జి. లక్ష్మి తదితరులు ఉన్నారు.

లలితా పీఠంలో వారాహి నవరాత్రులు ప్రారంభం



వారాహి దేవికి దత్తేశ్వరానంద భారతీ స్వామి పూజలు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో వారాహి నవరాత్రి మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. సాయంత్రం పండితుల మేదమంత్రాల మధ్య అమ్మవారికి సహస్ర నామార్చన, చతుర్వేద స్వస్తి జరిపారు. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా ఉమా చంద్రమౌళీశ్వరస్వామి 16 రోజుల పండగ



అమ్మవారి తాంబూలాలు తీసుకుంటున్న భక్తులు



విశేష అలంకరణలో ఉత్సవ మూర్తులు

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ ఉమా చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణోత్సవం ఈ నెల 11వ తేదీన అత్యంత వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా కల్యాణం జరిగి 16 రోజులు పూర్తయిన సందర్భంగా గురువారం ఆలయంలో పదహారు రోజుల పండగ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు జరిపారు. అనంతరం పుణ్య స్త్రీలకు దక్షిణ, తాంబూలాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తాంబూలాలు అందుకున్నారు.

ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ

మహారాణిపేట: విశాఖ పోర్టు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు మారీటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ కమాండర్ గోపీకృష్ణ శివ్వం తెలిపారు. పోర్టు అథారిటీ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల సహకారంతో 27 సంవత్సరాలలోపు వయస్సు గల బీటెక్ మెకానికల్, ఇంజినీరింగ్ డిప్లొమా, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, ఇంటర్, డిగ్రీ, పదో తరగతి ఉత్తీర్ణులైన విశాఖ పోర్టు పరిసర ప్రాంతాల ప్రజలు, కోటవీధి, పాత పోస్టాఫీసు, జాలారిపేట, అల్లిపురం, కొబ్బరితోట, మహారాణిపేట, పందిమెట్ట, జ్ఞానాపురం,75 ఫీట్ రోడ్డు, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజీ, గొల్లవీధి, కేజీహెచ్ తదితర ప్రాంతాల యువతీ యువకులకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉపాధికి సహకారం అందిస్తామన్నారు. ఈ ప్రాంతాలకు చెందిన తెల్ల రేషన్‌కార్డు కలిగిన అభ్యర్థులు జూలై 5వ తేదీలోగా విశాఖలో ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సింధియా జంక్షన్‌లో ఉన్న సీఈఎంఎస్ కేంద్రాన్ని 8688411100, 0891-2704010 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.